# ప్రజా ముచ్చట
తెలుగు దినపత్రిక
మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక
విలేకర్లు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంచార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
అనుభవం, ఆసక్తిగలవారు
99086 89674 లో
సంప్రదించగలరు



హైదరాబాద్ | సోమవారం,మే26,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1


## బెంగళూరులో మొదటి కొవిడ్ మరణం..

- బెంగళూరులో మళ్లీ కరోనా మరణం నమోదు
- రాష్ట్రంలో 38కి చేరిన యాక్టివ్ కేసులు, అత్యధికం బెంగళూరులోనే
- ఆందోళన అవసరం లేదన్న ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు
- రద్దీ ప్రాంతాల్లో వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని సూచన



## శంషాబాద్ వద్ద రోడ్డు ప్రమాదం

-రంగారెడ్డి జిల్లా శంషాబాద్ వద్ద రోడ్డు ప్రమాదం
-బెంగళూరు హైవేపై పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ
- కానిస్టేబుల్ విజయ్ కుమార్ మృతి.. మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలు




మే25,() రంగారెడ్డి జిల్లా శంషాబాద్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బెంగళూరు జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ.. పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో విజయ్ కుమార్ అనే కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు కానిస్టేబుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. విజయ్ కుమార్ శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇక, గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

- టీజీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలక్రిష్ణ రెడ్డి
- ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత
- మెటలార్జికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ మ్యాథ్స్, ఫార్మసీలో 100 శాతం ఉత్తీర్ణత నమోదు




తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో టీజీ ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలక్రిష్ణ రెడ్డి విడుదల చేశారు. ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మెకానికల్ ఇంజినీరింగ్‌లో పోతుగంటి కార్తిక్, సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్కొండ నిఖిల్ కౌశిక్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో శ్రీకాంత్, ఫార్మసీలో ఐలి



## పెండింగ్‌లో ఉన్న ఒక డీఏ విడుదలపై సర్కార్ యోచన...

**జూన్ 2 ఆవిర్భావ దినోత్సవాన సీఎం ప్రకటన చేసే అవకాశం**

- ఇతర బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపునకు కూడా ప్రణాళిక
- ఉద్యోగుల కోసం కొత్త ఆరోగ్య పథకం ప్రకటనపై చర్చ
- ఉన్నతాధికారుల కమిటీ నివేదిక సీఎంకు త్వరలో సమర్పణ
- ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ గుడ్ న్యూస్..

**హైదరాబాద్,మే25,**

తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ఓ శుభవార్త అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగులకు మేలు చేకూర్చే కొన్ని కీలక ప్రకటనలు చేయవచ్చని సమాచారం. ఈ ప్రకటనల్లో భాగంగా ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ కరువు భత్యం (డీఏ)లలో ఒకదానిని విడుదల చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఇతర బకాయిలు, పదవీ విరమణ చేసిన వారికి అందాల్సిన ప్రయోజనాలను కూడా ప్రభుత్వం అదే రోజు చెల్లించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది.

## మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలపై విచారణ చేపట్టాలి

**తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉంది**

- మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిల్లా మ్యాగీకి జరిగిన అవమానం తనను బాధించిందన్న కేటీఆర్
- ఇలాంటి వేదికలపై ఎదుర్కొన్న అనుభవాలను చెప్పేందుకు ఎంతో ధైర్యం కావాలని వ్యాఖ్య
- ఇలాంటి గడ్డపై ఓ మహిళకు అవమానకర పరిస్థితులు ఎదురుకావడం పట్ల ఆవేదన
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పరువును, భారతదేశ ప్రతిష్ఠను మంటగలిపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.



హైదరాబాద్,మే25,) హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీకి జరిగిన అవమానం తనను తీవ్రంగా బాధించిందని బీఆర్ఎస్ నేత ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి వేదికలపై ఎదుర్కొన్న అనుభవాలను చెప్పేందుకు ఎంతో ధైర్యం కావాలన్నారు. మిల్లా ఆరోపణలపై విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సుదీర్ఘ పోస్టు పెట్టారు. “మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ వేదికలపై స్త్రీ ద్వేషపూరిత మనస్తత్వాన్ని గట్టిగా ఎదుర్కోవడానికి చాలా ధైర్యం అవసరం. మిల్లా మ్యాగీ చాలా బలమైన మహిళ. తెలంగాణలో మీరు ఇలాంటి అవమానపూరిత పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చినందుకు నేను నిజంగా చింతిస్తున్నాను. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉంది.



## ‘మన్ కీ బాత్’ లో ‘యోగాంధ్ర-2025’ ప్రస్తావన...

- ఏపీ ‘యోగాంధ్ర-2025’ గురించి మాట్లాడిన ప్రధాని మోదీ
- ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేసిన ఏపీ సీఎం చంద్రబాబు
-యోగాంధ్ర లక్ష్యసాధనకు ప్రజలంతా ఐక్యంగా ఉన్నారు
- అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ రావాలని మోదీకి ఆహ్వానం

అమరావతి,మే25,(ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ‘మన్ కీ బాత్’ కార్యక్రమంలో ఏపీకి చెందిన ‘యోగాంధ్ర-2025’ కార్యక్రమాన్ని ప్రస్తావించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ‘యోగాంధ్ర-2025’ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ ఐక్యంగా కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చంద్రబాబు వెల్లడించారుజూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ యోగా శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. వంద పర్యాటక ప్రదేశాలతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

## ఢిల్లీలో కుంభవృష్టి..

**రోడ్లు జలమయం, విమానాల దారి మళ్లింపు**



- ఢిల్లీ, ఎన్‌సీఆర్‌లో భారీ వర్షం.. ఈదురుగాలులు
- వందకు పైగా విమానాలపై ప్రభావం..
- 49 దారి మళ్లింపు
- రోడ్లు, అండర్‌పాస్‌లు జలమయం, వాహనాలు నీట మునక

రోడ్లు జలమయం, విమానాల దారి మళ్లింపుదేశ రాజధాని ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) ఈ తెల్లవారుజామున భారీ వర్షం, ఈదురుగాలులు, ఉరుములతో అతలాకుతలమైంది. వేసవి తాపం నుంచి ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, నగరంలో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడం, విమాన సర్వీసులు ఆలస్యం కావడం వంటి తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి. విమాన సేవలకు అంతరాయంఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బలమైన ఈదురుగాలులు, కుండపోత వర్షం కారణంగా వందకు పైగా విమాన సర్వీసులపై ప్రభావం పడింది. శనివారం రాత్రి 11:30 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల మధ్య సుమారు 49 విమానాలను దారి మళ్లించినట్టు విమానాశ్రయ అధికారులు ఆదివారం తెలిపారు. రాత్రిపూట ఏర్పడిన అంతరాయాల వల్ల విమాన కార్యకలాపాలు ఇంకా ప్రభావితమవుతున్నాయని ఢిల్లీ విమానాశ్రయం తాజాగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రయాణికులు తమ విమాన స్థితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, తాజా సమాచారం కోసం సంబంధిత విమానయాన సంస్థలతో టచ్‌లో ఉండాలని సూచించింది.

## ‘బలగం’ నటుడు జీవీ బాబు కన్నుమూత

- గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జీవీ బాబు
- వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు మృతి
- జీవీ బాబు మృతి పట్ల బలగం దర్శకుడు వేణు విచారం




ప్రముఖ రంగస్థల కళాకారుడు, ‘బలగం’ సినిమా నటుడు జీవీ బాబు కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు మృతి చెందారు. జీవీ బాబు మృతి పట్ల బలగం దర్శకుడు వేణు విచారం వ్యక్తం చేశారు. జీవీ బాబు మరణం పట్ల సంతాపం తెలిపారు. ఆయన మొత్తం జీవితం నాటకరంగంలోనే గడిపారని, జీవీ బాబును బలగం సినిమా ద్వారా తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసే భాగ్యం తనకు దక్కిందని వేణు అన్నారు. ఇక, బాబు మృతి గురించి తెలుసుకున్న సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. కాగా, రెండేళ్ల క్రితం విడుదలైన ‘బలగం’ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన విషయం తెలిసిందే. ఇందులో భాగమైన నటీనటులందరికీ మంచి పేరు వచ్చింది. చాలా మందికి మంచి సినిమా అవకాశాలు కూడా వస్తున్నాయి. కాగా, ఇదే బలగం సినిమాలో ప్రియదర్శికి చిన్నతాత అంజన్నగా అద్భుతంగా నటించారు జీవీ బాబు. కథని ముందుకు తీసుకోవడంలో ఆయనదే కీలక పాత్ర. మన పల్లెటూర్లలో తాతలు ఎలా ఉంటారో అచ్చం అలాగే ఎంతో సహజంగా నటించి జీవీ బాబు మెప్పించారు. అలాంటి నటుడు మృతిచెందడంతో ఇండస్ట్రీలో విషాదం నెలకొంది.

# గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది:

### - మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు



పెన్ పహాడ్ / ప్రజా ముచ్చట, మే 25:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తుందని మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మల భుజంగరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మేఘ్య తండా ఆవాస గ్రామం గంగిలి తండలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరు కాగా రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కృషి చేస్తుందని, ఒకదాని తర్వాత ఒకటి హామీ ఇచ్చిన పథకాలనే కాకుండా నూతన పథకాలను అమలుపరుస్తూ ప్రజల మన్ననలను పొందుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండు వెంకన్న, కొక హుస్సేన్, కొక సైదులు, అంగోత్ సతీష్, బొల్లికొండ మనోహర్, పోలిశెట్టి సైదులు, వీరు, సందీప్, శీను, తదితరులు పాల్గొన్నారు..

# మూలమలుపులో రహదారిపై అడ్డంగా మట్టి కుప్ప...





### - వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం...?

పెన్ పహాడ్ / ప్రజా ముచ్చట, మే 25: మండలంలోని ప్రధాన రహదారిపై అడుగడుగున మూలమలుపులతో ఇప్పటికే ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులకు మరో ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని జానారెడ్డి నగర్ వద్ద పైపులైన్ మరమత్తు కోసం గుంత తవ్వి అ గుంతలో తీసిన మట్టిని మూలమలుపని కూడా చూడకుండా ఇస్టారీతిగా మట్టిని నిర్లక్ష్యంగా ప్రధాన రహదారిపై అడ్డంగా పోయడంతో వాహనదారులు రాత్రి వేళల్లో వాహనాలు నడిపేటప్పుడు కనిపించక ప్రమాదాలకు గురవుతారేమోనని రహదారి వెంట వెళ్లే పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా ఈ రహదారి వెంట గరిడేపల్లి నుండి దురాజ్ పల్లి వరకు వివిధ ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు కూడా ప్రమాదాలకు గురైయే పెను ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు ఆదమరిస్తే అంతే సంగతులు... ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోక ముందే ప్రధాన రహదారిపై అడ్డుగా పోసిన మట్టిని తొలగించాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు...

# బెడిసికొట్టిన మోడియా హడావుడి

భారతీయ మీడియా దాదాపు మోడీయా గా మారిపోయిందన్న విమర్శ చాలా కాలంగా ఉంది కూడా. కీలక అంశాల్లో సైతం వాస్తవాల పరిశీలన, లోతైన అధ్యయనం లేకుండా కేవలం కేంద్ర పాలక పక్షమైన బిజెపి, ఆర్ఎస్ఎస్ లు చేసే ప్రచారాన్ని మోత మోగించడం బడా మీడియాకు పరిపాటిగా మారింది. ప్రధానమంత్రి మోడీ పైన, ఆయన మంత్రివర్గ సహచరుల పైన, ఆయనకు సన్నిహితులైన కార్పొరేట్ అధినేతలపైన వచ్చే ఆరోపణలను ముక్తసరిగా ముగించటం బిజెపి వ్యతిరేక లౌకిక, ప్రాంతీయ పార్టీలకు సంబంధించిన ప్రతి అంశం భూతద్దంలో చెప్పడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో అన్ని వ్యవస్థలను అపహాస్యం చేయడానికి కూడా బడా మీడియా వెనుకాడటం లేదు. కరోనా సమయంలో అయితే ఇది పరాకాష్టకు చేరింది. ప్రభుత్వానికి భజన చేసే మీడియాను నెత్తిన పెట్టుకోవడం ఒకటైతే విమర్శించే వారిని నిర్బంధాలపాలు చేయడం, నిషేధించడం, వేధింపులకు గురిచేయటం నిత్యకృత్యమైంది. న్యూస్ క్లిక్, వైర్ న్యూస్ లతో సహా అనేక ప్రాంతీయ మీడియాలు, నిర్భయంగా పని చేసే సంపాదకులు, జర్నలిస్టులు, రచయితలు, అధ్యాపకులు నిఘా నేత్రానికి అక్రమ కేసులకు గురికావాల్సి వచ్చింది. రాజీవ్ గాంధీ హయాంలో బోఫోర్స్ కుంభకోణం వంటిది వస్తే నెలల తరబడి కథనాలు ఇచ్చిన మీడియా అతని కంపెనీ%ొా%అక్రమ విద్యుత్ ఒప్పందాల గురించి, అమెరికా సంస్థలు, అధికార వ్యవస్థల వివరాలు బయటపెట్టిన కేసుల లోతుపాతుల్లోకి పోకుండా పైపై వార్తలతో సరిపెట్టింది. అదే ఆంధ్రప్రదేశ్‌కు వస్తే ఇక్కడి వైసిపి, టిడిపి పరస్పరం తిట్టుకోడానికి తప్ప అసలు సమస్య వివరాల్లోకి పోకపోవడం, బలపరిచే మీడియా కూడా అలాగే వ్యవహరించడం చూస్తున్నాం. దేశం, రాష్ట్రాలకు సంబంధించిన ఈ కథలన్నీ అలా ఉంచితే ఇటీవల జరిగిన టెర్రరిస్ట్ హత్యాకాండ, భారత పాకిస్తాన్ సాయుధ సంఘర్షణ, నేపథ్యంలో భారతీయ మీడియా మరీ దారుణంగా తయారైంది. కాల్పుల విరమణ తర్వాత దేశంలోనే కాక అంతర్జాతీయంగా కూడా దాని పాత్రపై వివరమైన అధ్యయనాలు జరుగుతున్నాయి. సంచలన కథనాలు వెలువడుతున్నాయి.బాధ్యతా రాహిత్యంతో అవాస్తవాలను, అసత్యాలను ప్రచారంలో పెట్టిన తీరుకు ప్రపంచం విస్తుపోతున్నది. భస్మాసుర హస్తంలా ఇది చివరకు తనను సృష్టించిన నరేంద్ర మోడీ సర్కారుకే ఇరకాటంగా పరిణమించింది. మోడీకి ఈ మీడియానే అతి పెద్ద ప్రతికూలాంశంగా మారిందని అల్‌జజీర్ సమగ్ర కథనాలు, చర్చలు ప్రచారం చేసింది. న్యూయార్క్ టైమ్స్ ఈ విషయం పతాక శీర్షికతో ప్రచురించింది. దేశంలో కూడా వైర్ న్యూస్ వంటి వెబ్‌సైట్లు ఫోటోలు, కథనాలు ఇచ్చాయి. ఉద్రిక్తత తారాస్థాయికి చేరిన, యుద్ధ మేఘాలు అలుముకున్న, దాడులు జరుగుతున్న ఒక పూర్వ రంగంలో మీడియా ఎంత బాధ్యతా రహితంగా వ్యవహరించిందో తెలుసుకుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. కేవలం నాలుగు రోజుల పరాకాష్టల్లో సాగిన ఈ సాయుధ సంఘర్షణపై కథనాలు ఎలా నడిచాయో వాస్తవాలు ఏమిటో వెనక్కు తిరిగి చూసుకోవడం ఇప్పుడు అందరికీ సాధ్యమే. తెలుగుతో సహా ప్రాంతీయ మీడియా కూడా ఇదే వరవడిలో సాగింది కనుక ఎవరైనా ఈ అంశం స్వయంగా పరిశీలించవచ్చు. కాకపోతే జాతీయ మీడియాలో వచ్చిన వార్తలను తాము ప్రసారం చేశామని ప్రాంతీయ మీడియాలు సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ కోట్ల మంది ప్రజలు వీక్షించే ప్రాంతీయ మీడియా బాధ్యత కూడా తక్కువ కాదు. ఒక విధంగా సామాన్య ప్రజలను చేరేది అదే గనుక మరింత ఎక్కువ బాధ్యత కూడా ఉంటుంది.భారత్ పాకిస్తాన్ ఘర్షణపై మీడియా అనుసరించిన కథనాల శైలి బయటి దేశం మీదకాక స్వదేశం మీదనే దృష్టి పెట్టినట్లు సాగిందని విమర్శకుల విశ్లేషణ. అంటే దేశంలో వీక్షకులను సంచలన కథనాలతో ఆకట్టుకొని రేటింగ్ పెంచుకోవడం మతాలవారీ విద్వేషాలు పెంచి మైనార్టీలపై ద్వేషం రెచ్చగొట్టడం అనే రెండు లక్షణాలు ఇక్కడ కనిపిస్తాయి. సాధారణంగా సోషల్ మీడియానే ఇందుకు కారణమని చెప్పడం జరుగుతుంది. కానీ ఈ ఘర్షణ సమయంలో ప్రధాన మీడియా అన్నది కూడా ఇందుకు మినహాయింపు కాకపోవడం ఆందోళనకరం. ఆర్ణబ్ గోస్వామి రిపబ్లిక్ టీవీ వంటివి టీవీ స్టూడియోలను యుద్ధ రంగాలుగా మార్చేశాయి. తుపాకుల బొమ్మలు, ఆయుధాలు, చెట్లు నమూనాలతో మరింత ఉద్రిక్తతకు కారణమయ్యాయి. దాడులపై నిరాధారమైన కథనాలిచ్చాయి. ఇది ఎంతవరకు పోయింది? ఏ స్థాయిలో సాగింది? అంటే సీనియర్ సంపాదకుడైన రాజ్‌దీప్ సర్దేశారు ఆధారం లేని కొన్ని కథనాలు చెప్పినందుకు క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. ఆర్ణబ్ గోస్వామి అందుకు సిద్ధపడలేదు కానీ ఘోరంగా రెచ్చిపోయి వ్యవహరించారు. ఇక్కడ చెప్పుకోవాల్సింది ఏమంటే పాకిస్తాన్ మీడియా కూడా అందుకు ఏమాత్రం తీసిపోని విధంగా అసత్య కథనాలతో ఆవేశం పెంచడానికి పనిచేసింది. ఆ మీడియాని గనుక నమ్మినట్లయితే ఢిల్లీపై దాడి జరిగిందని భావించాల్సి వచ్చేది.ఆర్ణబ్ గోస్వామి కథనాల ప్రకారం 400 డ్రోన్లను భారత సైన్యం ఒక్క దెబ్బతో పేల్చివేసింది. పాకిస్తాన్‌లో సైనిక కుట్రే జరిగిపోయింది. దాడి కకావికలం చేసింది. ఐఎన్ఎస్ విక్రాంత్ బయల్దేరి కరాచీ రేవును ధ్వంసం చేసింది. ఇండియా న్యూస్ టీవీ కథనం ప్రకారం లాహోర్ ధ్వంసమైంది. ఎన్.డి టివి కథనం ప్రకారం ట్యాంకులు కూల్చివేయబడ్డాయి. 17 జె.ఎఫ్ విమానాలను, ఎఫ్ 16 విమానాలను పాకిస్తాన్ నుంచి భారత సైన్యం పట్టుకున్నదని ఇండియా టుడే కథనం ప్రసారం చేసింది. ఆజ్ తక్ చానల్‌లో అంజనా మిశ్రా, శ్వేతా కశ్యప్ ఆవేశపూరితమైన కథనాలు ఇవ్వటమే కాకుండా పాకిస్తాన్ సూసైడ్ దళాలు సైన్యంపై దాడికి కుట్ర పన్నాయని ప్రసారమైంది. ఎ.బి.పి, జీ న్యూస్ లు పాక్ సైనిక దళాల ప్రధాన అధికారి మునీర్‌ను తొలగించేసినట్టు ప్రసారం చేసింది. 450 మంది ప్రైవేట్ సైన్యం దాడి చేస్తున్నట్లుగా అజరు శర్మ కథనం ఇచ్చారు. ఉదాహరణలు చెప్పాలంటే స్థలాభావం అడ్డొస్తుంది. ఇలాంటి కథనాలతో రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రజలు చాలా ఆందోళన చెందారని కూడా తర్వాత బయటకు వచ్చింది. ఈ వివరాలన్నింటి నిజానిజాలను ఆల్ట్ న్యూస్, క్వింట్ వంటివి బయటపెట్టాయి. పంజాబ్ కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ శర్మ ఈ అసత్య కథనాల సుదీర్ఘ జాబితాను తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు

# సత్యాలకే శిక్ష - కట్టు కథలకు బహుమానం


మోడీ ప్రభుత్వ వైఖరి కూడా ఈ పరిస్థితికి ఒక ప్రధాన కారణం. ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి రైల్వే టికెట్లపై ఆ పేరుతో మోడీ బొమ్మలు ముద్రిస్తున్న ప్రస్తుత సమయం దాకా ఈ పరిణామాలను రాజకీయ ప్రచారానికి వాడుకోవటం అన్నది ఒక వ్యూహంగా తయారైంది. తొలి దశలో ఈ ధోరణులను ప్రోత్సహించడం వల్ల అవి తర్వాత అదుపు తప్పిపోయాయి. నాలుగు రోజుల్లోనే కాల్పుల విరమణ జరిగాక ఇదంతా ఒక రహస్యంగా తయారయింది. ఈ నాలుగు రోజుల్లోనూ సంఘపరివార్ నేతలు క్రమ పద్ధతిలో కథనాలు వదులుతూ వచ్చారు. చానళ్లలో, పత్రికల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ఒక విధంగా మతతత్వ రాజకీయాలతో మతపరమైన విభజన పెంచే విద్వేష వాదనలు చేశారు. సోషల్ మీడియాకు, ప్రధాన మీడియాకు అసత్య సమాచారాలు రావడానికి కొందరు కారకులయ్యారు. తమాషా ఏమంటే కేంద్రం ఇలాంటి శక్తులను అదుపు చేయడానికి బదులు%ొా%వాస్తవాలను బాధ్యతాయుతంగా అందిస్తున్న వైర్ వంటి పత్రికలపై%ొా%మూత బూచి వేయడానికి ప్రయత్నించింది. మధ్యప్రదేశ్ మంత్రి విజరు సైనిక దళాల తరఫున మాట్లాడిన సోఫియా ఖురేషిని టెర్రరిస్టుల సోదరి అని దుర్భాషలాడితే హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా క్షమాపణలు చెప్పమని ఆదేశిస్తే, బిజెపి నాయకులు, ప్రభుత్వాల నేతలు ఒక చర్య కూడా తీసుకోలేదు. కానీ అలీఖాన్ మహమ్మద్ వంటి ప్రొఫెసర్లను నిష్కారణంగా అరెస్టు చేసిన తర్వాత వారికి సుప్రీంకోర్టులో బెయిల్ వచ్చింది. కేంద్రంగానీ బిజెపి నాయకులు కానీ ఇంత అసంబద్ధంగా వ్యవహరించడానికి బలమైన కారణాలే ఉన్నాయి. ఈ ఘర్షణను విపరీతంగా ప్రచారం చేయడం వల్ల వారు ఆశించిన రాజకీయ ప్రయోజనం కలగలేదు. పైగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యంతో హఠాత్తుగా విరమించారన్న విమర్శ కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది.ఇప్పుడు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి తాము ట్రంప్ కు ఈ విషయాలు చెప్పలేదని పార్లమెంటరీ ప్రతినిధి వర్గాలకు వివరణ ఇస్తున్నారు. ముందుగా పాకిస్తాన్ డిజిఎంఓ తమను సంప్రదించాకే కాల్పులు విరమణ జరిగిందని ఆయన అంటున్నారు. అదే నిజమైతే ఇంత ఘర్షణ తర్వాత బేషరతుగా కాల్పుల విరమణకు మోడీ ప్రభుత్వం అంగీకరించిందని భావించాలా? శాంతి పునరుద్ధరణ మంచిదే అయినప్పటికీ ఉగ్రవాదులను అప్పగించడం వంటి కనీసమైన షరతులు కూడా పెట్టలేదా? అణ్వాయుధ నిల్వలున్న 'కిరణా హిల్స్' ముఖద్వారాన్ని మిసైల్స్ ఢకొట్టడం వంటి వార్తలు చాలా వచ్చాయి కానీ ఇప్పుడు విక్రమ్ మిస్రీ ఏ దశలోనూ పాకిస్తాన్ అణ్వాయుధ వినియోగం గురించి చెప్పలేదని ఎంపీలకు వివరించారు. అంటే ఇరు దేశాల్లోనూ ప్రసారమైన రెచ్చగొట్టే కథనాలు కేవలం కల్పితాలని అర్థం కావడం లేదా? ఉద్రిక్తత తగ్గాక ఈ సంచలనాలు చేయటం వేరు. సరిహద్దులు రగిలిపోతున్న సమయంలో నిరాధారమైన కథనాలు చలామణి చేయడం వేరు. ఈ విషయంలో బడా మీడియా వ్యవహరించిన తీరు దేశానికి తలవంపులు తేవడమే కాక గతంలో ఉన్న మీడియా ప్రతిష్టను మరింత దిగజార్చింది. భారతీయ మీడియా ఇలా వ్యవహరించటం మామూలు అయిపోయిందని అంతర్జాతీయ సంస్థలు తేల్చివేశాయి.ప్రకృతిలో కుక్క తోక తరహాలో కొన్ని వంకరగానే వుంటాయి. ఈ మీడియా సంస్థలూ, మోడీ భజన బృందాలు కూడా అందుకు నకళ్ళలాగా వ్యవహరించడం హాస్యాస్పదం. సాయుధ ఘర్షణలో అసత్య ప్రచారాలు, విరమణతో విన్యాసాలు చేశాయి సరే. ఇప్పుడు దేశం కోసం అన్ని పార్టీలూ విదేశాలలో దౌత్య ప్రచార బృందాలలో కలసి వస్తే ఇదీ మోడీ ఘనతగా మీడియా చిత్రిస్తున్నది. మొదటే చెప్పినా వినకుండా యుద్ధ హడావుడి తర్వాత దౌత్య మార్గం వైపు తిరగవలసి వచ్చిందనేది వాస్తవం. ఇందులోనూ శశిథరూర్ వంటి భజనమూర్తుల కక్కుర్తి వేషాలకే అధిక ప్రచారం ఇస్తూ మోడీ సర్కారు చిన్న బుద్ధిని దాచిపెడుతోంది. మొత్తానికి ఇప్పుడు దేశంలో ఇతర పార్టీలపైనా విశ్వగురుడే గెలిచాడని బడా మీడియా హైప్ సీజన్-2 పెంచబోతోంది. తథాస్తు, మరి. తర్వాత అదీ చూద్దాం!

# దేశ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకుందాం

పహల్గాంలో ఉగ్రవాదుల అమానుష దాడి జరిగి నెల రోజులైంది. ఉగ్రవాదంపై యుద్ధంతో ప్రారంభమై, కాల్పుల విరమణతో ముగిసిన పరిణామాలు దేశ సమైక్యతకు, సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా మారాయి. దేశ భద్రతకు సవాలుగా మారిన ఉగ్రవాదాన్ని గట్టిగా అరికట్టాలని ప్రతి భారతీయుడు కోరుకున్నాడు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను బలపరిచారు. ఉగ్ర దాడికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా సమైక్యతా భావం వెల్లివిరిసింది. అయితే అమెరికా ఆదేశాలతో జరిగిన కాల్పుల విరమణ, తదనంతర సంఘటనలు ఇన్నేళ్ళుగా మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయి. యుద్ధోన్మాదంతో రెచ్చిపోయిన మూకలు అధికారుల మీద, వారి కుటుంబ సభ్యుల మీద చేస్తున్న ట్రోలింగ్ దాడులు సైమక్యతకు సవాళ్ళు విసురుతున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రధాని మౌన మునిగా మారిపోవడం మరింత ఆందోళనకరం. పాలక అనుచర మీడియా రోత పుట్టేలా మోత మోగించినా వాస్తవాలను గ్రహించిన నెటిజన్లు అన్ని వైపుల నుండి వదులుతున్న ప్రశ్నల శరాఘాతాలకు కేంద్ర పాలకులు, వారి అనుయాయులు తల్లడిల్లుతున్నారు. తాము పెంచి పోషించిన సోషల్ మీడియా తమకే భస్మాసుర హస్తంగా మారుతుండడంతో బెంబేలెత్తుతున్నారు. ట్రంప్ ఆలింగనం ధృతరాష్ట్ర కౌగిలిగా మారుతుండంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్నారు.ఉగ్ర దాడి %-% కాల్పుల విరమణకాశ్మీర్ లోని పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు 26 మందిని బలిగొన్నారు. 16 మంది అక్కడికక్కడే చనిపోగా పది మంది ఆసుపత్రికి తరలిస్తున్నప్పుడు, చికిత్స పొందుతున్నప్పుడు మరణించారు. ఇందులో ఒకరు నేపాలీ కాగా మిగిలినవారు భారతీయులు. కాల్పుల సమయంలో ఉగ్రవాదులను ఎదిరించి వీర మరణం పొందిన సయ్యద్ హుస్సేన్ కాశ్మీర్ స్థానికుడు కాగా, మిగిలిన వారు సుందర కాశ్మీరాన్ని సందర్శించడానికి వచ్చిన యాత్రికులు. దాడి జరిగిన వెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి జమ్ముకాశ్మీర్‌కు వెళ్లగా, సౌదీ అరేబియా పర్యటనలో వున్న ప్రధాని పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని వచ్చారు. ఉగ్రవాద దాడి వెనుక పాకిస్తాన్ హస్తం వుందని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మరుసటి రోజు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశం జరిపి కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని తక్షణం తాత్కాలిక నిలుపుదల చేసి, కిందకు నీటి పారుదలను నిలిపివేసింది. అట్టారీ-వాఘా సరిహద్దు మూసివేసింది. గతంలో పాకిస్తానీయులకు జారీ చేసిన ప్రత్యేక వీసాలను రద్దు చేసింది. వారంతా 48 గంటల్లో దేశం విడిచి వెళ్ళాలని, ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నేవీ, వైమానిక సలహాదారులు వారం రోజుల్లో దేశం విడిచిపోవాలని ఆదేశించింది. ఇంత తీవ్రంగా ప్రభుత్వం స్పందించిన మరుసటి రోజు అంటే ఏప్రిల్ 24న రాజకీయ పార్టీల సమావేశం వేశారు. అందులో ప్రధాని పాల్గొనకుండా బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్ళి మొట్టమొదటిసారి ఇంగ్లీషులో ఉపన్యసించారు. "పహల్గాం ఉగ్ర దాడి వెనుక వున్నవారిని, కుట్రలో భాగమైన వారిని ఊహకందని రీతిలో శిక్షిస్తాం, ప్రతి ఉగ్రవాదిని గుర్తించి శిక్షిస్తామని భారతీయులకు హామీ ఇస్తున్నా"నని ఆ సభలో ప్రకటించారు. కాశ్మీర్‌లోని ఉగ్రవాద ఇళ్ళుగా ఎంపిక చేసిన వాటిని ఏప్రిల్ 28న కూల్చి వేసి, సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ఏప్రిల్ 29న ప్రధాని ప్రకటించారు.ఈ పరిణామాల నేపథ్యంలో బిజెపి భజన బృందం అటు సోషల్ మీడియా, ఇటు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో ఎంత రెచ్చగొట్టాలో అంతా చేశారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టాలని, ప్రజల మధ్య మత విభజన తీసుకురావాలని ఉగ్రవాదులు పథకం ప్రకారం ఈ దాడి చేశారు. దానికి ఊతమిచ్చేలా ఈ మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. పాకిస్తాన్‌పై యుద్ధం జరుగుతుందని, ఒక్క దెబ్బతో ఆ దేశం సర్వనాశనం అవుతుందని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటున్నామని, పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించనున్నామని ఇలా నోటికి, చేతికి అడ్డు అదుపు లేకుండా చెప్పారు, రాశారు. అమరావతి రెండవసారి శంకుస్థాపనకు వచ్చిన మోడీ నమో మిస్సైల్ అని ఒకరు, ఆయన మనసు నిండా పహల్గాం ఆవేదనతో ఉన్నారని మరొకరు పోటీ పడి కీర్తించారు. మరోవైపు, పవన్ కళ్యాణ్ విద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. అయితే మీడియాలోని కొన్ని సంస్థలు, సోషల్ మీడియాలోని కొందరు వ్యక్తులు వాస్తవ పరిస్థితులను తమ శక్తి మేరకు వినిపించే ప్రయత్నం చేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ యువత, ప్రజలు స్పందించిన వీడియోలు, బాధిత కుటుంబాల ప్రతిస్పందనలు వాస్తవ భారతీయతను ప్రతిబింబించాయి. దేశవ్యాప్తంగా ఐక్యంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి మృతులకు నివాళి అర్పించడంతో పాటు, ఉగ్రవాదాన్ని, దాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను తీవ్రంగా నిరసించారు. దశాబ్దాల తర్వాత కాశ్మీర్ ప్రజలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బంద్ పాటించారు. ఉన్మాదం ఎంత ప్రమాదకరమైనదో దేశం గుర్తించింది. మతోన్మాద రాజకీయాలకు ఇది హెచ్చరికగా మారింది.మెరికా జోక్యంతో దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం మే 7 తెల్లవారుజామున 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ప్రాంతాల్లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడులు జరిగాయి. నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించి భారత ఆర్మీ తన శక్తి సామర్థ్యాలను చాటింది. దీనికి పాకిస్తాన్ ప్రతిదాడులు చేసింది. పాకిస్తాన్ అణ్వాయుధ దాడికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించడంతో మరింత ఉద్రిక్తత పెరిగింది. ఇలాంటి స్థితిలో అకస్మాత్తుగా మే 10న కాల్పులు విరమిస్తున్నట్లు భారత్, పాక్ ప్రకటించాయి. ఈ ఇరుదేశాలు ప్రకటించక ముందే 'అమెరికా మధ్యవర్తిత్వంతో రాత్రంతా జరిగిన చర్చలు, సంప్రదింపుల ఫలితంగా భారత్, పాకిస్తాన్‌లు తక్షణమే కాల్పుల విరమణకు అంగీకరించాయి' అని అమెరికా అధ్యక్షుడు 'ట్రంప్ ట్రూత్ సోషల్' అనే ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశాడు. ఆ తర్వాత మన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కాల్పుల విరమణను ప్రకటించడంతో పహల్గాం ఉగ్రవాదులను ఎక్కడున్నా శిక్షిస్తానన్న ప్రధాని వాగ్దానం నెరవేరకుండానే ఎందుకు విరమించారు? కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు ప్రకటించడమేమిటి? అనే ప్రశ్నల పరంపర పెరిగింది. మే 10న సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైజల్ బిన్ ఫర్హాన్ కూడా భారత్, పాక్ విదేశాంగ మంత్రులతో మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించినట్లు ప్రకటించాడు. ఇన్నేళ్ళుగా భారత్, పాకిస్తాన్ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వానికి అవకాశం లేకుండా అనుసరించిన మన విదేశాంగ విధానం సార్వభౌమత్వానికి ప్రతీకగా వుంది. స్వాతంత్ర్యానంతరం నుండి మన దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని సామ్రాజ్యవాద దేశాలు అనేక ఎత్తులు వేస్తూ వచ్చాయి. ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండానే మన స్వతంత్రతను కాపాడుకుంటూ వచ్చాము. అందుకు నాటి సోవియట్ రష్యా సహకారం కూడా ఒక కారణం. ఈ విధానం మన దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో పెంచింది. వాణిజ్య ప్రయోజనాల బెదిరింపుతో కాల్పులు విరమించారని, అమెరికా సరుకులపై భారతదేశం పన్నులు వేయకుండా అంగీకరించిందని వరుసబెట్టి అమెరికా అధ్యక్షుడు చేస్తున్న ప్రకటనలు మన సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. నిత్యం దేశభక్తి జపం చేసే పాలకులు ఇంతగా అమెరికాకు ఎందుకు సాగిలపడుతున్నారు? ఉగ్రవాదాన్ని అరికడతామని బయలుదేరి స్వతంత్ర విదేశాంగ విధానానికి ప్రమాదం తేవడమేమిటి? ఇంత జరుగుతున్నా ప్రధాని మాత్రం మౌనంగా వుండడం వెనుక రహస్యం ఏమిటి? విదేశాంగ శాఖ చేసిన ప్రకటన కంటి తుడుపు చర్యగా వుంది తప్ప, దేశ సార్వభౌమత్వం ప్రతిధ్వనించేలా లేదు. తన దేశ ఆర్థిక వ్యవస్థ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా ఆసియా ఖండంలో ఆధిపత్యం చెలాయించడానికి మన దేశాన్ని పావుగా వాడుకుంటున్నది. మోడీ ప్రభుత్వం అందుకు తోడ్పడుతున్నది.

# పాలకుల సైన్సు, గణిత పరిజ్ఞానం అమోఘం!

కేంద్రంలో అధికారంలో ఉన్న మన దేశ నాయకుల ఆలోచనా విధానం ఎలా ఉంది? గణితం, సైన్సు వంటి విషయాల పట్ల వారికున్న పరిజ్ఞానం ఎంత అనేది బేరీజు వేసుకుందాం!మహా కుంభమేళాకు అరవై ఆరు కోట్ల మంది వచ్చి పుణ్యస్నానాలు చేశారని మన దేశ నాయకులు, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నాయకులు కలిసికట్టుగా డప్పుకొట్టి ప్రచారం చేసుకున్నారు. అదెలాగా? అని అడిగితే మన లాంటి సామాన్యులకు వారు సమాధానం చెప్పరు. మనం అల్పులం కదా? వారి గణిత స్థాయిని మనం అందుకోలేమని వారు అనుకొని ఉండొచ్చు. అందుకే కొన్ని సంస్థలు, కొందరు స్వతంత్ర జర్నలిస్టులు లెక్కలు వేశారు. ఏలిన వారి గణిత పరిజ్ఞానం ఇదీ అని ప్రజల ముందు పెట్టారు. దేశ జనాభా 140 కోట్లు. ఇందులో 66 కోట్లు అంటే, సుమారు సగం జనాభా కుంభమేళా స్నానాలు చేశారని కదా చెప్పుకుంటున్నారు. దేశంలో పసిపాపలు, పదేళ్ల లోపు పిల్లల జనాభా 25 కోట్లు. సుమారు 15 కోట్ల మంది వయోవృద్ధులు, వికలాంగులు-ముస్లింలు-క్రైస్తవులు ఇంకా ఇతర మతస్థులు 20 కోట్ల మంది ఉన్నారు. వీరెవరూ కుంభమేళా స్నానాలకు రాలేదు. రానివారి లెక్క చూస్తే, అది సుమారు 55 కోట్ల మంది అవుతున్నారు. వీరుగాక, అలాంటి సనాతన సంప్రదాయం పట్ల అభిరుచి లేని వారు విముఖత చూపేవారు మరి, కోట్ల మందే ఉంటారు. వీరందరిని తీసేస్తే స్నానాలు చేసిన వారి సంఖ్య 66 కోట్లు ఎలా వస్తుంది? వచ్చారనడానికి ఆధారమే లేదు. ఇలా కాకుండా, మరో రకంగా కూడా ఒక సంస్థ వారు సర్వే నిర్వహించారు. బస్సులు, రైళ్లు, విమానాలు, కార్లు వంటి వాటిపై అక్కడికి చేరుకున్న వారి సంఖ్య లెక్క కట్టారు. ఏ వాహనంలో ఎంతమంది ప్రయాణించగలరో మనకు తెలుసు గనుక, రోజుకు అవి ఎన్ని ట్రిప్‌లు వేయగలవో తెలుసు గనక ఒక రోజులో ప్రయాగ్‌కు ఎంతమంది చేరుకోగలరో తెలిసిపోతుంది. ఆ రకంగా మన పాలకులు చెప్పే 66 కోట్ల జనం అబద్ధం అని తేలింది.కుంభమేళాలో తొక్కిసలాట జరిగి కొందరు మరణిస్తే, అక్కడి టెంట్‌లు తగలబడి కొందరు, రోడ్డు ప్రమాదాల్లో కొందరు, రైల్వేస్టేషన్‌లలో తొక్కిసలాట జరిగి కొందరు మరణిస్తే, రాష్ట్ర, దేశ నాయకులెవరూ సంతాపం తెలుపలేదు. తమ అసమర్థతను ఒప్పుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది-చెప్పలేదు. మృతుల కుటుంబాలను




ఏ రకంగానూ ఆదుకోలేదు. పైగా-కుంభమేళా మృతులకు "భగవంతుడు లభించాడని'-యు.పి ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ యోగి కూడా అదేవిధంగా భగవంతుడిలో ఐక్యం కావడానికి ప్రయత్నించవచ్చు కదా? రోగాల బారిన పడ్డ వాళ్లూ, కాళ్లూ, చేతులూ విరిగినవారు ఎందరో ఆస్పత్రుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. యోగి చెప్పిన విధంగా వారికి భగవంతుడు ప్రాప్తించడం లేదు. ఇక్కడ సామాన్య జీవితమూ దొరకడం లేదు. ఇక యోగి, మోడీలు కూడా దేశ ప్రజల్ని నమ్మించడానికి చుట్టూ తాళ్లు కట్టుకుని, బాడీగార్డులను పెట్టుకుని కుంభమేళా స్నానం చేశామనిపించారు. వారికి బాడీగార్డుల మీద ఉన్న విశ్వాసం దేవుడి మీద లేదన్నది ఈ దేశ ప్రజలకు అర్థమైంది. ఆ సందర్భంలోనే ఒక సంఘటన జరిగింది. ఒక బిజెపి అంధభక్తుడు మురికి గంగలో పలుమార్లు మునిగి తేలడం వల్ల, పవిత్ర జలాలనుకుని వాటిని మింగడం వల్ల- తీవ్రంగా జబ్బుపడ్డాడు. అతనికి గత ప్రభుత్వం కాంగ్రెస్ అంటేనే చిర్రెత్తుకొస్తుంది. అందువల్ల తమ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కట్టించిన ఆసుపత్రిలోనే తనను చేర్పించాలని పట్టుబట్టాడు. కుటుంబ సభ్యులూ, మిత్రులూ కలిసి ఆసుపత్రుల చరిత్ర తవ్వుతూ తిరిగారు. వారి పట్టణంలో కాదుగదా, దేశమంతా దుర్భిణి వేసి వెతికినా అలాంటిది ఏదీలేదని, తెలిసేసరికి పేషెంట్‌కు ప్రాణం మీదికి వచ్చింది. విధి లేక అందుబాటులో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేర్పించారు. ఈ ప్రపంచమే నిద్రలో జోగుతున్న మనుషుల గుంపు! నిద్రలో ఉన్నవారు మెలకువగా ఉన్నవారిని భరించలేరు. విశ్వాసకులు అవిశ్వాసకుల్ని భరించలేనట్టుగా మెలకువగా ఉన్నవారు ఏవేవో శబ్దాలు చేస్తున్నారని, తమను నిద్రపోనివ్వడం లేదని నిద్రలో జోగే జనం, మనోభావాలు దెబ్బ తీసుకుంటారు. ఉత్తరప్రదేశ్‌లోని ఒక జైలు అధికారులు మహా కుంభమేళా త్రివేణి సంగమం నుండి కొన్ని నీళ్లు తెప్పించారు. జైలు ట్యాంకులో కలిపి అక్కడి ఖైదీలందరికీ ఆ నీళ్లతో స్నానం చేసే అవకాశం కలిగించారు. వారి పాపాలు తొలగిపోతాయన్నది వారి విశ్వాసం. అదే నిజమైతే, పాపాలు తొలిగిన ఖైదీలు కొందరైనా విడుదల కావాలి కదా? బీఫ్ కంపెనీల నుండి బలవంతంగా చందాలు వసూలు చేసుకునేవారు వరుసగా మహాకుంభ మేళాకు క్యూ కట్టారట! బీఫ్ కంపెనీ యజమానులంతా బిజెపి వారే గనుక, వారెలాగూ, ముందే వెళ్లి మునిగి ఉంటారు. వీరందరి పాపాలు పోవాలి కదా! ముస్లింల పేర్లతో బీఫ్ ఎగుమతులు చేసే బిజెపి వారు పవిత్రులైపోయినట్టేనా? వారు మళ్లీ కొత్త పాపాలు చేసుకోవచ్చా?కుంభమేళా పేరుతో చాలా గమ్మత్తులు జరిగాయి. అందులో ఒకటి ఇలా జరిగింది. కుంభమేళాకు వెళ్లలేని వారు వారి ఫొటోలు పంపితే ఆ ఫొటోలను త్రివేణి సంగమంలో ముంచి, మంత్రోచ్చారణతో మంగళ స్నానం చేయిస్తాం. దీనివల్ల కుంభమేళా స్నాన ఫలితం ఆ ఫొటోలో ఉన్న వారికి సంపూర్ణంగా లభిస్తుంది. ఈ అవకాశం ఉపయోగించుకోదలచిన వారు ఈ కింది ఫోన్ నెంబర్‌కు రూ.500 ఫోన్ పే గాని, గూగుల్ పే గాని చేయవచ్చు అని ఒక సంస్థ ప్రకటించింది. ఇకనేం మన దేశంలో అంధవిశ్వాసులకేం తక్కువ? వేల మంది ఎగబడ్డారు. వాడెవడో తెలివిగా కూచున్నచోట నుంచి కదలకుండా డబ్బు సంపాదించుకున్నాడు. వచ్చిన ఫొటోలు ఏరోజుకారోజు కాల్చేశాడు. విషయం బయటికి రాకుండా జాగ్రత్తపడ్డాడు. అయినా ఆ సంస్థ చేసిన మోసం పత్రికలెక్కింది. "పావన్ గంగాకి జల్ పవిత్ర్ హై, స్వచ్ఛ్ హై"-అని యు.పి ముఖ్యమంత్రి గొప్పగా మాట్లాడితే సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ "మిస్టర్ యోగీ! ఆ నీటిని తాగి చూపించు" అని సవాల్ విసిరారు. మహా కుంభమేళా నీటిలో ఫీకల్ (మలంలో వుండే) బ్యాక్టీరియా అధికంగా వుందన్న రిపోర్టు సంచలనంగా మారిన నేపథ్యంలో యోగికి ఆ సవాల్ విసిరారు ఆయన. యోగి నోరు మెదపలేదు.మోసపోవడానికి రెండు మార్గాలున్నాయి. 1.సత్యం కాని దాన్ని నమ్మడం. 2.సత్యాన్ని నమ్మడానికి ఇష్టపడక, తిరస్కరించడమే అంటారు డానిష్ తత్వవేత్త, రచయిత సోరెన్ ఆబీ కీర్కెగార్డ్.జీవశాస్త్రం మీద, వైద్యశాస్త్రం మీద మంచి "పట్టు" సాధించిన సంప్రదాయ సనాతన వాది కృష్ణ స్వరూప్‌దాస్‌జీ తన ప్రవచనంలో భక్తులకు ఇలా చెప్పాడు. "నెలసరిలో భర్తలకు వంట చేసి పెట్టే భార్యలు కుక్కలుగా పుడతారు." -గుజరాత్‌లోని భుజ్‌లో స్వామి నారాయణ్ మందిర్‌లో ఈ "వైజ్ఞానిక" అంశాన్ని సెలవిచ్చారు. దీన్ని మనం నమ్మాలి అని వారి భావన! అలాగే కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సత్య పాల్ సింగ్ మరొక అంశాన్ని వెలుగులోకి తెచ్చాడు. "వానరం నరుడిగా మారడాన్ని మనం చూడలేదు. మన పూర్వీకులు కూడా చూడలేదు. అసలు ఇంత వరకు ఎవరూ చూడలేదు. అందువల్ల జీవ పరిణామ సిద్ధాంతం తప్పు-దీన్ని మన విద్యాసంస్థల సిలబస్‌ల నుండి తీసివేయాలి!" అన్నాడు. దీన్ని అలా ఉంచి, వారు నమ్మే సృష్టి సిద్ధాంతాన్నే పరిశీలిద్దాం. మరి దేవుడిని ఎవరు చూశారూ? దేవుడు మనుషులను యథాతథంగా సృష్టిస్తున్నప్పుడు ఎవరు చూశారు? సత్యపాల్ సింగ్ కానీ, అతని పూర్వీకులు గానీ, వారివారి పూర్వీకులుగానీ చూశారా? ఆయన మనల్ని అడిగిన లాజిక్‌నే ఉపయోగించి మనం ఆయన్ని అడుగుతున్నాం కదా?'కమలం గుర్తు ఈ దేశంలో ఒక తాయత్తు లాంటిది. అది దగ్గరుంచుకుంటే-ఈడి, ఐటి లాంటివేవీ పట్టి పీడించవు' అన్నాడొక యువ సైన్సు కార్యకర్త వ్యంగ్యంగా-నిజమే కదా మనం చూస్తున్నది!

# అగ్నికీలలు మింగేస్తున్నా పాఠాలు నేర్వమా!

హైదరాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు కేంద్రాలుగా ఎలా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. వ్యవస్థాపక లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే సంభవిస్తున్న దుస్థితికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరుగుతాయనుకుంటే పొరపాటే. తరచుగా ఇవి నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల పర్యవసానమే. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలినిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేనివారితో చేయించిన తాత్కాలిక మరమ్మతులు%ో%షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడం, మానవ నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి.నిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేనివారితో చేయించిన తాత్కాలిక మరమ్మతులు%ో%షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడం, మానవ నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి.సమస్యకు మరో కీలక కోణం ఏమిటంటే, మన దేశంలో అగ్ని భద్రతా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలున్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్, వివిధ రాష్ట్రాల అగ్నిమాపక సేవల చట్టాలు భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలైన ఫైర్-రెసిస్టెంట్ మెటీరియల్ వాడకం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ డిటెక్షన్, అణచివేత వ్యవస్థలు, తప్పనిసరి ఆడిట్‌లు, నిరభ్యంతర ధృవీకరణ పత్రం తప్పనిసరి చేస్తాయి. అయినప్పటికీ వీటి ఆచరణలో అనేక లోపాలున్నాయి. తగినంత మంది శిక్షణ పొందిన ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం, నియంత్రణ సంస్థలలో వనరుల కొరత, తనిఖీ అనుమతి ప్రక్రియలో జాప్యం, అవినీతి, భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, బాధ్యులను న్యాయస్థానాలకు అప్పగించే ప్రక్రియలో లోపం%ో%నిర్లక్ష్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్ని భద్రత పట్ల విస్తృతమైన ప్రజా అవగాహన లేకపోవడం, సౌలభ్యం ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి కూడా ఈ సమస్య తీవ్రతరం చేస్తున్నాయి. భవనాలలో నివసించే వారికి, పని చేసే వారికి ప్రాథమిక అగ్ని భద్రతా పద్ధతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు.అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలో అవగాహన ఉండదు. ప్రైవేట్ భవనాలలో అగ్నిమాపక డ్రిల్స్ నిర్వహించడం చాలా అరుదు. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.ఈ బహుముఖ సమస్యను పరిష్కరించడానికి పటిష్టమైన, సమగ్ర వ్యూహం అవసరం. దీనికి ప్రభుత్వ నిబద్ధత, కఠినమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. కేవలం చట్టాలు ఉండటం కాదు. వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వ భవనాలకు తప్పనిసరిగా నిర్ణీత కాల వ్యవధిలో అగ్ని భద్రతా ఆడిట్‌లు నిర్వహించాలి. వీటిని స్వతంత్ర, అర్హత కలిగిన థర్డ్ పార్టీల ద్వారా చేయించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రాంగణాలను సీల్ చేయాలి. ప్రమాదం జరిగితే క్రిమినల్ బాధ్యత వహించేలా చట్టాలు బలంగా ఉండాలి. అనుమతి ప్రక్రియను పారదర్శకంగా, అవినీతి రహితంగా, సాంకేతిక ఆధారితంగా మార్చాలి. రెండవది, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయడానికి గణనీయమైన పెట్టుబడి పెట్టాలి. పట్టణ సవాళ్లకు అనుగుణంగా ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది సంఖ్యను పెంచడం, కమ్యూనికేషన్ వ్యవస్థలు మెరుగుపరచడం,

# ట్రంప్ సుంకాలు, చైనా స్మార్ట్ కర్మాగారాలు, మన 'మేకిన్ ఇండియా'


దశాబ్దాల పాటు వివిధ దేశాలకు తరలించిన వస్తూత్పత్తి పరిశ్రమలను అమెరికాకు తిరిగి రప్పించి%ో%అమెరికన్లకు ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రపంచ దేశాలపై సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. ప్రభుత్వ పరిపాలనా వ్యయంలో దుబారాను అరికట్టే పేరిట ఎలాన్ మస్క్ నేతృత్వంలో ఏర్పరిచిన 'డిపార్టమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ' వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతూ, ఆఖరుకు ఫెడరల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలను కోత పెట్టిన నేపథ్యంలో ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం అమెరికన్లకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించడానికి కాదనేది స్పష్టం అవుతున్నది. ఆర్థికంగా, వాణిజ్యపరంగా నానాటికి బలోపేతం అవుతూ అమెరికన్ ప్రపంచాధిపత్యానికి సవాలుగా మారుతున్న చైనాను దెబ్బతీసి ఒంటరిపాటు చెయ్యడమే ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం వెనుక ఉన్న అసలు ఉద్దేశం. ట్రంప్ మిడిసిపాటుతో ప్రకటించిన సుంకాలు వార్తాపత్రికల పతాక శీర్షికలుగా చలామణీ అవుతుంటే చైనా తన మానాన తాను దేశ వస్తూత్పత్తి రంగాన్ని, ఆర్థిక వ్యవస్థను పటిష్టంగా, బలీయంగా పెంపొందించుకుంటూ పోతున్నది. రోబోటిక్స్, కృత్రిమ మేధ (ఎ.ఐ), డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలోకి పెట్టుబడులు ఆహ్వానించడం ద్వారా చైనా సంప్రదాయిక లేబర్ ఇంటెన్సివ్ వస్తూత్పత్తి విధానం నుండి పూర్తి స్థాయి యాంత్రీకరణ, హైటెక్ విధానంతో కూడిన రాత్రి కర్మాగారాల వైపునకు మళ్ళించింది. యాంత్రీకరణ విప్లవం ద్వారా చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దశ, దిశలను మార్చేస్తున్న వైనాన్ని గురించి ఇప్పటికే వివిధ కథనాలు వెలువడ్డాయి. మరోవంకన వస్తూత్పత్తి రంగంలో అభివృద్ధి సాధించడానికి 'మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, స్టార్టప్ ఇండియా'ల పేరిట మోడీ ప్రభుత్వం రకరకాల పథకాలను ప్రకటించినా ఇవి ఆచరణలో ఆశించిన ఫలితాలు సాధించడంలో విఫల నమూనాలుగా మిగిలాయి. నయా ఉదారవాద విధానాల భ్రమల నుండి బయటపడి శాస్త్ర-సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించడానికి దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకుని నిబద్ధతతో ఆచరించడం ద్వారా మాత్రమే భారతదేశం స్వావలంబన సాధించగలుగుతుందన్న తెలివిడి, స్పృహ పాలకులకు కలగనంత వరకు పరిస్థితులలో గుణాత్మక మార్పులు రావు.చైనా కారుచౌక శ్రామిక శక్తికి నెలవు అని దశాబ్దాలుగా పేరు పడింది. కానీ గత పదేళ్లగా చైనా వ్యూహాత్మకంగా అత్యున్నత స్థాయి వస్తూత్పత్తి రంగానికి కేంద్రంగా మారింది. 2015లో చైనా ప్రభుత్వం రాబోయే పదేళ్ళలో రోబోటిక్స్, కృత్రిమ మేధ తదితర పది అత్యున్నత సాంకేతిక రంగాలలో ప్రగతి సాధించి 'మేడిన్ చైనా-2025 సాధించాలని ప్రణాళిక రూపొందించుకున్నది. ఇందుకు అనుగుణంగా శాస్త్ర పరిశోధనా రంగాలలో అద్భుత ఫలితాలు సాధించడానికి అనువుగా భారీ పెట్టుబడులు పెట్టడం, తేటలికగా బ్యాంక్ రుణాలు అందేలా చూడడం వంటి చర్యలు చేపట్టింది. ఒక్క 2023వ సంవత్సరంలోనే రోబోటిక్స్ రంగంలో శాస్త్ర పరిశోధనకు 1.4 బిలియన్ డాలర్లు కేటాయించింది. అలాగే ఇందుకు తగిన సాధన సామాగ్రిని సమకూర్చుకోవడం కోసం భారీ ఎత్తున పారిశ్రామిక రుణాలు అందేలా చూసింది. ఇవాళ చైనా ప్రపంచంలోనే అత్యధిక ఫ్యాక్టరీ రోబోట్ల వినియోగదారుగా ఎదిగింది. సగటున 10,000 మంది కార్మికులకు 392 రోబోట్ల వినియోగంతో ప్రపంచ సగటు వినియోగం కన్నా మూడు రెట్లు ఆధిక్యతతో ముందున్నది. చైనాలో దేశవ్యాప్తంగా పరిశ్రమలను కృత్రిమ మేధ, రోబోటిక్స్‌తో అనుసంధానించే ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నది. అధునాతన సెన్సార్ల ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన వస్తూత్పత్తి చేస్తున్నది. తద్వారా సరసమైన ధరలకే నాణ్యమైన వస్తువులు అందించగలుగుతున్నది. అమెరికా సుంకాల విధింపును లెక్క చెయ్యకుండా ఐరోపా యునియన్ దేశాలకు, ఇతర వర్ధమాన దేశాలకు చైనా ఉత్పత్తులు భారీగా ఎగుమతి చేయగలుగుతున్నది. జనాభాలో వయసు మళ్ళిన వారి శాతం పెరుగుతూ ఉండటం, యువతరం ఫ్యాక్టరీలలో పనుల కన్నా ఉన్నత చదువుల మీద దృష్టి కేంద్రీకరించడం మూలంగా చైనాలో దేశీయ పరిశ్రమల్లో భారీఎత్తున యాంత్రీకరణ అమలు చేయడం అనివార్యమైంది. చైనా ప్రభుత్వం దేశవ్యాప్తంగా 30 వేల 'స్మార్ట్' ఫ్యాక్టరీలను నిర్మించింది. పరిశ్రమలను డిజిటలైజ్ చేసి, కృత్రిమ మేధను అనుసంధానించడం ద్వారా ఈ అధునాతన 'స్మార్ట్' ఫ్యాక్టరీలను తీర్చిదిద్దింది. వీటికి తోడు మరో 1200 'అడ్వాన్స్‌డ్' స్థాయి ఫ్యాక్టరీలను 230 'ఎక్సలెంట్' స్థాయి ఫ్యాక్టరీలను నిర్మించడం ద్వారా వస్తూత్పత్తి రంగం ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేసింది.ఈ స్మార్ట్ ఫ్యాక్టరీలు అధికోత్పత్తి సాధించడానికి వీలుగా పారిశ్రామిక ఉత్పత్తి వ్యవస్థలను 'అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్', 'డేటా ఎనలిటిక్స్'తో అనుసంధానించారు. సాంకేతిక పరిభాషలో దీనినే పారిశ్రామిక అంతర్జాలం (ఇండస్ట్రియల్ ఇంటర్నెట్) అంటారు. 5జి ప్లస్ ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ల అనుసంధానం ద్వారా ప్రధాన పారిశ్రామిక వాడల్లో భారీ స్థాయి ఉత్పత్తిని సాధించే అనేకానేక పైలట్ ప్రాజెక్టులను చేపట్టింది చైనా ప్రభుత్వం. 2024లో ఈ వ్యవస్థలను ఎ.ఐ తో అనుసంధానించడం ద్వారా నాణ్యత, నిర్వహణా సామర్థ్యం మెరుగుపరచడంతోపాటు స్వయం నిర్ణయం తీసుకునే శక్తిని కూడా కల్పించారు. జాతీయ స్థాయిలో, ప్రావిన్స్‌ల (రాష్ట్రాలు) స్థాయిలో స్మార్ట్ ఫ్యాక్టరీలు, డిజిటల్ వర్క్‌షాప్‌లను ఎ.ఐ తో అనుసంధానించే కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు.చైనా ప్రభుత్వం చేపట్టిన అత్యాధునిక యాంత్రీకరణ రాత్రి కర్మాగారాలు నెలకొల్పడానికి దారితీసింది. ఈ కర్మాగారాలు మానవ జోక్యం లేకుండా పూర్తి స్థాయి కృత్రిమ మేధ, రోబోటిక్స్, అడ్వాన్స్‌డ్ సెన్సార్ల ఆధారంగా పనిచేస్తాయి. మానవ శ్రమతో ఉత్పత్తి చేపట్టడానికి రాత్రిపూట పట్టపగల్లా వెలుగునిచ్చే విద్యుత్ కాంతి, కార్మికులకు విశ్రాంతి గదులు వంటివేవీ ఈ కర్మాగారాలకు అవసరం పడవు. పగలూ, రాత్రీ అనే తేడా లేకుండా, రోజులో 24 గంటలూ ఇవి ఉత్పత్తి కొనసాగిస్తూనే ఉంటాయి. కృత్రిమ మేధలో అనుసంధానించిన మూలంగా ఈ కర్మాగారాలు మానవ సామర్థ్యానికి మించిన సామర్థ్యంతో నాణ్యతాప్రమాణాలుగల ఉత్పత్తిని సాధిస్తున్నాయి. ఈ అద్భుత ఫలితాలు చూశాక చిన్న చిన్న పరిశ్రమలు, కర్మాగారాలలో కూడా సంక్లిష్టమైన వనులకు కృత్రిమ మేధలో పని చేసే రోబోట్లను వినియోగించడం మొదలుపెట్టారు. పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యాలను, అంక గణితాన్ని మౌలికంగా మార్చివేయడానికి ఈ యాంత్రీకరణ ఎంతగానో తోడ్పడింది. ఇవాళ చైనా పరిశ్రమల్లో వినియోగిస్తున్న రోబోట్లను అమెరికా రూపొందించుకోవాలంచే రెండింతలు ఖర్చు చెయ్యాల్సి వస్తుంది. చైనాలో విడిభాగాల ఉత్పత్తి కర్మాగారాలు, సరఫరా వ్యవస్థలు అందుబాటులో ఉండటం బాగా కలిసి వచ్చింది. గేర్లు, అయస్కాంతాల తయారీ తయారీలో 90 శాతం ప్రపంచోత్పత్తి, బ్యాటరీ సెల్‌ల తయారీలో 80 శాతం ప్రపంచోత్పత్తి కలిగిఉన్న చైనా తన ఆధిక్యతను చాటుకుంటున్నది. అరుదైన భూ ఖనిజాలు, కీలకమైన ఖనిజ లవణాల నిక్షేపాలు, వాటిని శుద్ధి చేయడం మీద చైనా ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉన్న కారణంగా-ఈ రంగంలో చైనా ప్రపంచాధిపత్యం నడుస్తుంది. అలాగే సరఫరా వ్యవస్థల మీద చైనా సాధించిన పట్టు, ప్రగతిల కారణంగా వస్తూత్పత్తి రంగంలో ఏ దేశం కూడా చైనాతో వీటికి రాగలిగే పరిస్థితుల్లో లేదు.సంప్రదాయ పారిశ్రామిక రోబోట్ల తయారీలో పాటు చైనా సాధారణ అవసరాల కోసం తగిన హ్యూమనాయిడ్ రోబోట్ల తయారీ రంగంలో కూడా పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నది. యూని ట్రీ, యూనిటెక్ వంటి స్టార్టప్ కంపెనీలు ఇప్పటికే ఈ రోబోట్లను సరసమైన ధరలకు మార్కెట్‌లో అందు బాటులోకి వచ్చేలా చేశాయి. 2025 చివరి వాటికి భారీ ఎత్తున ఉత్పత్తి సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయి. కృత్రిమ మేధలో మంచి నేర్పరితనం, నైపుణ్యాల అభివృద్ధి కోసం సాగే పరిశోధనల రంగంలో చైనా ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టింది. అదే పశ్చిమ దేశాల, ముఖ్యంగా అమెరికన్ కార్పొరేట్ కంపెనీల విషయానికి వస్తే తరువాత తరం 'రోబోటిక్స్' పరిశోధనా రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వెనుకాడుతున్నాయి. అమెరికన్ సాంకేతిక రంగం వాస్తవ ప్రపంచంలో సత్వరంగా 'సూపర్' లాభాలు సంపాదించడం మీద పెట్టే శ్రద్ధలో అర వంతు కూడా ఉత్పత్తి రంగంలో ప్రగతి సాధించడానికి అనువుగా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా లేవు.

# నాజీల ఓటమికి కారణాలు... సామ్రాజ్యవాదుల కట్టుకథలు



నాజీ జర్మనీని ఓడించినది ప్రధానంగా సోవియట్ యూనియన్. తమ మాతృ దేశ రక్షణ కోసం సోవియట్ ప్రజలు చేసిన అపార త్యాగాలు ఎవరి ఊహలకూ అందనంత స్థాయిలో ఉన్నాయి. ఐతే, మొదటినుంచీ పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ఈ సత్యాన్ని ఏదో ఒక విధంగా మరుగుపరిచి నాజీ జర్మనీ ఓటమికి కారణం తాము చేసిన ప్రయత్నాలే అని చెప్పుకోడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. ప్రారంభంలో ఈ ప్రయత్నం చాప కింద నీరులాగా సాగింది. అప్పట్లో కనీసం ఆ పశ్చిమ దేశాల ప్రజలు కూడా వారి ప్రచారాన్ని విశ్వసించలేదు. ఇక ఆ పశ్చిమ దేశాల మేథావులైతే ప్రత్యక్షంగా ఆ యుద్ధాన్ని చూసినవారు గనుక అది ఎలా పరిణమించిందో తెలుసు గనుక ఈ తప్పుడు ప్రచారం వారి వద్ద చెల్లలేదు.నాజీ జర్మనీని ఓడించినది ప్రధానంగా సోవియట్ యూనియన్. తమ మాతృ దేశ రక్షణ కోసం సోవియట్ ప్రజలు చేసిన అపార త్యాగాలు ఎవరి ఊహలకూ అందనంత స్థాయిలో ఉన్నాయి. ఐతే, మొదటినుంచీ పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ఈ సత్యాన్ని ఏదో ఒక విధంగా మరుగుపరిచి నాజీ జర్మనీ ఓటమికి కారణం తాము చేసిన ప్రయత్నాలే అని చెప్పుకోడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. ప్రారంభంలో ఈ ప్రయత్నం చాప కింద నీరులాగా సాగింది. అప్పట్లో కనీసం ఆ పశ్చిమ దేశాల ప్రజలు కూడా వారి ప్రచారాన్ని విశ్వసించలేదు. ఇక ఆ పశ్చిమ దేశాల మేథావులైతే ప్రత్యక్షంగా ఆ యుద్ధాన్ని చూసినవారు గనుక అది ఎలా పరిణమించిందో తెలుసు గనుక ఈ తప్పుడు ప్రచారం వారి వద్ద చెల్లలేదు. ఈ విధంగా సత్యాన్ని మరుగుపరిచే విషయంలో హాలీవుడ్ కూడా తెలిసో తెలియకో తన వంతు పాత్ర పోషించింది. హాలీవుడ్‌లో నిర్మించిన పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలు – 'ది లాంగెస్ట్ డే', 'ది గన్స్ ఆఫ్ నవ్రాన్, మొదలు 'సేవింగ్ ప్రైవేట్ రియాన్' వరకూ–పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు నాజీలకు వ్యతిరేకంగా ఎలా 'గొప్పగా' పోరాడారో, ఏ విధంగా నాజీలను ఓడించారో ఆ చిత్రాల్లో చూపించారు. ఈ చిత్రాలు పశ్చిమ దేశాల ప్రేక్షకుల కోసం ప్రధానంగా ఉద్దేశించబడ్డాయి. అందుకే ఆ చిత్రాల మౌలిక కథనాలు ఆ విధంగా ఉన్నాయి. కాని రెండవ ప్రపంచ యుద్ధం ప్రధానంగా నాజీ జర్మనీకి, పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలకు నడుమ జరిగినట్టు, నాజీలను, దాని మిత్రులను పశ్చిమ దేశాలు ఓడించినట్టు జరుగుతున్న తప్పుడు ప్రచారానికి ఆ చిత్రాలు బలాన్ని చేకూర్చాయి.ఆ యుద్ధంలో బ్రిటన్ సుమారు 5 లక్షల మంది ప్రజల ప్రాణాలను కోల్పోయింది. వారిలో సైనికులు, పౌరులు కూడా ఉన్నారు. అమెరికా అంతకన్నా తక్కువ సంఖ్యలోనే ప్రాణ నష్టాన్ని చవి చూసింది. దీనిని సోవియట్ యూనియన్‌తో పోల్చి చూడండి. ఆ దేశం 2 కోట్ల 70 లక్షల మంది ప్రజల ప్రాణాలను కోల్పోయింది. కాని ఈ వాస్తవం పాశ్చాత్య దేశాల ప్రజల జ్ఞాపకాల్లో ఎక్కడా మిగలలేదు. వాస్తవానికి యుద్ధంలో ఎంతెంతమంది ప్రాణాలను త్యాగం చేశారన్నది ప్రధానం కాదు. ఆ సంఖ్య ఎంత తక్కువైనా, వారి త్యాగాలను గౌరవించాల్సిందే. కాని పాశ్చాత్య దేశాల ప్రజానీకం జ్ఞాపకాల్లో సోవియట్ ప్రజల అపార త్యాగాలకు ఏ స్థానమూ లేకపోవడం మాత్రం చాలా అన్యాయం.పశ్చిమ దేశాలు ఆ యుద్ధం ముగిసిన తర్వాత మొదలుబెట్టిన ప్రచ్ఛన్న యుద్ధ వ్యూహానికి ఇది చాలా ఉపయోగపడింది. సోవియట్ యూనియన్ త్యాగాలను మరుగుపరచడంతోబాటు, సామ్రాజ్యవాద దేశాలు మరొక దుర్మార్గమైన ప్రచారానికి తెర తీశారు. సోవియట్ యూనియన్ విస్తరణ కాంక్షతో ఉందని, పశ్చిమ యూరప్‌ను ఆక్రమించుకోడానికి పథకాలు పన్నుతోందని వారు ప్రచారం మొదలుబెట్టారు. అప్పుడే ముగిసిన యుద్ధంలో ఏకంగా 2 కోట్ల 70 లక్షల మందిని పోగొట్టుకుని భారీ స్థాయిలో వినాశనాన్ని చవిచూసిన సోవియట్ యూనియన్ అంత త్వరలో ఏవిధంగా విస్తరణకు పూనుకుంటుంది? ఈ ఇంగిత జ్ఞానం కూడా పశ్చిమ దేశాల ప్రచారకులకు లేదు. విన్‌స్టన్ చర్చిల్ వంటి పక్కా సామ్రాజ్యవాది నాయకత్వంలో సోవియట్ వ్యతిరేక ప్రచారానికి పూనుకున్నారు. యూరప్‌కు సోవియట్ నుండి ప్రమాదం పొంచి వుందని పాట ఎత్తుకున్నారు. నిజానికి యూరప్ దేశాల పాలకవర్గాల ఆధిపత్యానికి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో అంతర్గతంగానే తీవ్ర సవాలు ఎదురైంది. దానిని తిప్పికొట్టడానికి ఆ పాలకవర్గాలు ప్రజలకు పలు రాయితీలను ఇవ్వవలసి వచ్చింది. అటువంటి రాయితీలలో సంక్షేమ రాజ్యం అనేది ఒకటి. దేశీయంగా సంక్షేమరాజ్యాన్ని ఏర్పరచడంతోబాటు తమ ఆధీనంలో ఉన్న వలసలకు స్వతంత్రాన్ని ఇవ్వడం రెండవది (ఈ రెండవ చర్యకు చర్చిల్ పూర్తి వ్యతిరేకి). వాస్తవానికి యాల్టాలో, పోట్స్‌డామ్ సమావేశాల్లో కుదిరిన అవగాహనకు సోవియట్ యూనియన్ పూర్తిగా కట్టుబడి వ్యవహరించింది (ఫాసిస్టు కూటమికి వ్యతిరేకంగా పోరాడుతున్న శక్తులు ఈ రెండు సమావేశాల్లో పాల్గొన్నాయి). వాస్తవానికి గ్రీస్‌లో విప్లవం ఆ కాలంలో తలెత్తినప్పుడు దానికి సహాయంగా నిలవడానికి సోవియట్ యూనియన్ ముందుకు రాలేదు. ఆ కారణంగా గ్రీక్ విప్లవం ఓటమిపాలైంది. ఐనా సరే, సామ్రాజ్యవాదులు మాత్రం సోవియట్ యూనియన్‌ను ఒక భూతంగా చిత్రించడం మాత్రం మానుకోలేదు. ఆ ప్రచారం ద్వారా పశ్చిమ దేశాల పాలకవర్గాలు తమ ఆధిపత్యానికి ఎదురౌతున్న సవాలును తట్టుకోడానికి ప్రయత్నించారు.బ్రిటిష్ వలసగా భారతదేశం ఉన్నప్పుడు ఇక్కడి ప్రజల నుండి బలవంతంగా చేయించిన త్యాగాలు పశ్చిమ దేశాలు అన్నీ కలిసి రెండో ప్రపంచ యుద్ధంలో చేసి త్యాగాలకన్నా చాలా ఎక్కువ అన్నది చాలా మంది గుర్తించరు. ఆ యుద్ధంలో తూర్పు రంగాన బ్రిటన్ జపాన్‌తో తలపడవలసి వచ్చింది. అందుకయ్యే ఖర్చులో అత్యధిక భాగాన్ని అప్పటి భారతదేశం లోటు బడ్జెట్ ద్వారా భరించింది. ఆ యుద్ధంలోకి భారతీయులు వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే బలవంతంగా లాగబడ్డారు. భారతదేశం నుండి యుద్ధ ఖర్చుల నిమిత్తం బ్రిటన్ బలవంతంగా రుణాలు తీసుకుంది. ఆ రుణాలను న్యాయంగా ఇండియాకు తిరిగి చెల్లించాల్సి వుంది. కాని యుద్ధం ముగిసిన చాలా కాలం వరకూ తిరిగి చెల్లించనేలేదు. బడ్జెట్‌లో ఏర్పడిన లోటు కారణంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో అప్పుడు ఎటువంటి రేషనింగు విధానమూ లేదు. దాంతో బెంగాల్ గ్రామీణ ప్రాంతాల్లో విపరీతమైన కరువు ఏర్పడింది. ఆ కరువుకు 30 లక్షల మంది బలయ్యారు (అదే బ్రిటన్‌లో మొత్తం యుద్ధకాలం అంతటికీ 5 లక్షల మంది మాత్రమే మరణించారు). ధరల పెరుగుదల కారణంగా బ్రిటన్ ఇండియాకు తిరిగి చెల్లించవలసిన రుణం విలువ బాగా పడిపోయింది. దానికి తోడు పౌండు విలువను 1949లో తగ్గించారు. రుణం పౌండ్ల లెక్కల్లో ఉన్నందున వాస్తవంగా ఇండియాకు దక్కినది అసలు రుణంలో కొద్ది భాగం మాత్రమే. యుద్ధంలో పాల్గొనడానికి ఏ మాత్రమూ సంసిద్ధం కాకపోయినా, బ్రిటన్ అనుసరించిన విధానం వలన 30 లక్షల మంది బెంగాలీ ప్రజలు ఆ యుద్ధానికి బలైపోయారు.ఇప్పుడు నాజీలను ఓడించడంలో సోవియట్ యూనియన్ పాత్రను కప్పిపుచ్చే ప్రయత్నం ట్రంప్ హయాంలో తారాస్థాయికి చేరింది. నిజానికి నాజీ జర్మనీని ఓడించినది ప్రధానంగా అమెరికాయేనని పచ్చి అబద్ధాలను అడ్డగోలుగా ట్రంప్ ప్రకటిస్తున్నాడు. కొత్త తరం యువతకు ఆ యుద్ధానికి సంబంధించిన పూర్తి వాస్తవాలు తెలియకపోవచ్చు. కాని 1946లో పుట్టిన ట్రంప్‌కు యుద్ధానంతర కాలపు జీవితంతో ప్రత్యక్షానుభవం ఉంది. ఐనా, ఇలా సిగ్గు లేకుండా పచ్చి అబద్ధాలను వాగడం ట్రంప్ కే చెల్లింది. యుద్ధం ముగిసిన తర్వాత సామ్రాజ్యవాదులు మొదలుబెట్టిన తప్పుడు ప్రచారానికి ఇది కొనసాగింపే.ఈ ఏడాది నాజీ జర్మనీపై విజయం సాధించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాస్కోలో విజయోత్సవాలు నిర్వహించారు. వాటిలో పాల్గొనడానికి అప్పటి మిత్ర దేశాలైన బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలకు రష్యా ఆహ్వానం పంపింది. కాని సామ్రాజ్యవాద దేశాలు ఆ ఉత్సవాలను బహిష్కరించాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని అవి సాకుగా చూపించి ఉత్సవాలకు ఎగనామం పెట్టాయి. నిజానికి ఆనాటి యుద్ధంతో పుతిన్‌కు ఏ సంబంధమూ లేదు. కాని అప్పటి ఘన విజయాన్ని ఇప్పుడు సంబరంగా జరుపుకుని ఆ ఖ్యాతిలో వాటా కొట్టేద్దామని పుతిన్ తాపత్రయ పడుతున్నాడు. అంతమాత్రం చేత సామ్రాజ్యవాద దేశాలు ఆ ఫాసిస్టు వ్యతిరేక విజయోత్సవాలను బహిష్క రించడం సమర్ధనీయం కానే కాదు. పోనీ అలా బహిష్కరించడానికి వారు అప్పటి సోవియట్ యూనియన్‌కు ఇప్పటి పుతిన్‌కు తేడా ఉందని ఏమైనా వాదన ముందుకు తెచ్చారా అంటే అదీ లేదు.ఐతే ఈ సందర్భంలో ఒక విషయాన్ని మనం గుర్తించాలి. కేవలం చైనా, వియత్నాం, క్యూబా వంటి సోషలిస్టు దేశాలు మాత్రమే కాకుండా చాలా మూడవ ప్రపంచ దేశాలు ఈ విజయోత్సవాలకు హాజరయ్యాయి. వాటిలో బ్రెజిల్, వెనిజులా, బుర్కినా ఫాసో (ఈ దేశం ఇప్పుడు ఫ్రెంచి–అమెరికన్ సామ్రాజ్యవాదంతో తలపడుతోంది) వంటి దేశాలు ఉన్నాయి. ఈ ఉత్సవాలలో భారతదేశం పాల్గొనలేదు. ఇదేమీ ఆశ్చర్యం కలిగించేది కాదు. ప్రస్తుత ప్రభుత్వ అధినేతల హిందుత్వ వాదానికి మూలాలు ముస్సోలినీ, హిట్లర్‌ల దగ్గర నుంచి సంక్రమించాయి. ఆ యుద్ధ కాలంలో హిందుత్వ వాదులు నాజీలకు మద్దతుగా వ్యవహరించారు. ప్రపంచం లోని అత్యధిక మెజారిటీ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా నిలిచారు.ఇక్కడ ఇంకొక అంశాన్ని కూడా చూడాలి. చాలా దేశాల్లో ఫాసిస్టు శక్తులు తిరిగి అధికారంలోకి వస్తున్నాయి. ఇటువంటి సమయంలో ఫాసిస్టు–వ్యతిరేక ఉత్సవాలలో పాలుపంచుకోవడం పశ్చిమ దేశాల సామ్రాజ్య వాదులకు ప్రాధాన్యతాంశంగా ఉండదు. ఎందుకంటే సామ్రాజ్యవాద శక్తులు ఈ ఫాసిస్టు శక్తులలో చాలా వాటితో పొత్తులకు సుముఖంగా ఉన్నారు. ఇలా ఉన్నవారిలో డొనాల్డ్ ట్రంప్ అందరికన్నా ముందుంటాడు. అతగాడి అనుంగు మిత్రుడు ఎలన్ మస్క్ జర్మన్ నయా నాజీ పార్టీ అయిన ఎ.ఎఫ్.డి కి వీరాభిమాని. రష్యాతో ప్రస్తుతం యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్ ప్రభుత్వానికి సామ్రాజ్యవాద దేశాల మద్దతు ఉంది. ఆ ఉక్రెయిన్ ప్రభుత్వం నిండా స్టెపాన్ బండేరా అనుయాయులు ఉన్నారు. ఈ స్టెపాన్ బండేరా రెండో ప్రపంచ యుద్ధ కాలంలో తమను ఆక్రమించుకోడానికి వచ్చిన నాజీలకు బంటుగా వ్యవహరించాడు.

# అంతటా దోపిడి అవుతున్న ఆమె శ్రమ




దేశంలోని తల్లులు రక్తలేమితో బాధపడుతున్నారు. నిజానికి కార్మిక రంగంలో వున్న మహిళల పట్ల చాలా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. రైతు కూలీలు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకార, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న స్త్రీలపై జరిగిన పరిశోధనలో వారు రక్తలేమితో మధ్య వయస్సులోనే వంగిపోయి, కీళ్ళు అరిగిపోయి, ప్రభుత్వాల నుండి యాజమాన్యాల నుండి ఎటువంటి సహాయం లేక పిల్లలకు పాలు కూడా ఇవ్వలేని స్థితిలో జీవిస్తున్నారు. గర్భవతులుగా వున్నప్పుడు కూడా కూలికి వెళ్ళకపోతే జరగక మురికి వాడల్లో వుంటూ పౌష్టికాహారం లేక పచ్చళ్ళు తింటూ జీవిస్తున్నారు. వ్యవసాయ రంగంలోనైతే నడి ఎండల్లో నాట్లు వేయడం, పగిలిన కాళ్ళతో కూడా బురదలో దిగి కలుపు తీయడం, మధ్యాహ్నానికి కళ్ళు తిరిగి పడిపోతున్నా అటు పాలకులు గాని ఇటు భూస్వాములు గాని మజ్జిగ కూడా ఇవ్వని దయలేని ప్రభుత్వంలో అభాగ్యంగా జీవిస్తున్నారు. ముఖ్యంగా చేనేత రంగంలో వున్న స్త్రీలు రక్తలేమితో బాధ పడుతున్నట్లుగా సర్వేలు చెపుతున్నాయి. మహిళల శ్రమ దోపిడీ గురించి మహిళా మేధావులు వ్యధాపూరితమైన విషయాలను ప్రపంచం ముందుకు తెస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదు.మహిళలు ఇంటా బయటా చాకిరీ చేస్తున్నారు. కాని కోట్లాది మంది మహిళల కోట్లాది గంటల శ్రమకి ఆర్థిక విలువ లేదు. గుర్తింపు లేదు. ఎవరైనా గృహిణిని 'మీరేం పని చేస్తారు?' అంటే 'నేనేమీ చెయ్యను!' అంటుంది. రోజంతా తను చేసే పనిని 'పని' కాదు అని చెబుతుంది. ఆమె కుటుంబం కూడా ఆమె పని చెయ్యదు అని చెబుతుంది. విరామం లేకుండా ఇంట్లో ఆమె చేసే చాకిరీకి ఎలాంటి విలువ లేదు. ఈ దేశంలో కోట్లాది మంది మహిళలు ప్రతి రోజూ చేసే పని అదృశ్యం అవుతుంది. కుటుంబానికే కాదు, ప్రభుత్వాలకూ కనబడదు. కొన్ని గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మహిళలు చేసే గృహ, సంరక్షణ శ్రమకు ఆర్థిక విలువ లెక్కించినట్లైతే అది కొన్ని బిలియన్ డాలర్ల విలువైనదిగా ఉంటుంది. అయినప్పటికీ ఈ శ్రమ ఎప్పుడూ ఆర్థిక లెక్కల్లోకి రాదు. దానికి కారణం తరతరాలుగా మహిళల శ్రమను సహజమైన బాధ్యతగా చూడడం. అంటే మహిళలు పుడుతూనే చీపుళ్ళు, చాటలు, గరిటెలు పట్టుకుని పుట్టినట్టు. ఇంటి పని మహిళలకు చాలా సహజమైనదనే ప్రచారం పితృస్వామ్య సమాజం చేసింది.భారత రాజ్యాంగం స్త్రీల కోసం, మహిళల రక్షణ కోసం వారి ఆర్థిక వెసులుబాటు కోసం, వారి విద్యాభివృద్ధి కోసం ఎన్నో చట్టాలు చేసింది. కాని చాలామంది కొడుకుతో సమానంగా కూతురుకి సమాన ఆస్తి ఇవ్వడంలేదు. అందువల్ల వాళ్ళు నిర్భాగ్యులుగా జీవించాల్సి వస్తుంది. గ్రామాల్లో కొడుకుతో సమానంగా కూతుర్ని చదివించటం లేదు. చివరకు కార్పొరేట్ స్కూళ్లలో కొడుకులను, గవర్నమెంటు స్కూల్‌లో కూతుళ్లను చదివిస్తుంటారు. ఇప్పుడు పదవ తరగతి పాసయిన ఆడపిల్లల్ని ఇంటర్మీడియట్‌లో చేర్చటం లేదు. వందల మంది ఆడపిల్లలకి బాల్య వివాహాలు జరుగుతున్నాయి. వాళ్ళు ఇంటర్‌కి వెళితే, ఊరు దాటి వెళితే ప్రేమలో పడతారనే అపోహతో తల్లిదండ్రులే వారిని నిరోధిస్తున్నారు. నిజానికి మనుస్మృతి చదవకపోయినా ఆ భావజాలం మాత్రం తండ్రుల మీద, భర్తల మీద బలంగా వుంది.దళిత వాడల్లో తాగుడు ఎక్కువై తల్లిని, భార్యను నిందిస్తున్నారు. తాగుడు కోసం భార్యను కొట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఇంట్లో పిల్లలు చదువుకొనే వాతావరణం లేకుండా చేస్తున్నారు. కొన్ని ఇళ్ళలో స్త్రీలు పొయ్యి మీద కుండ పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. మరొకవైపు వ్యవసాయంలో పని దినాలు బాగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో కార్పొరేటు సంస్థలు రొయ్యలు బాగు చేయటం కోసం రాత్రి పూట 11 గంటల నుండి స్త్రీలను ఆటోల్లో పనులకు తీసుకొని వెళ్తున్నారు. అందుకు వాళ్ళకు అనేక జబ్బులు వస్తున్నాయి. పిల్లలకు ఆలన పాలన చూడలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వాలు వ్యవసాయ కూలీల జీవన వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయి.బడుగు వర్గాల్లోనే కాదు. అన్ని వ్యవస్థల్లోను స్త్రీలు పురుష పెత్తనం కింద నలిగిపోతున్నారు. ఇదే అదనుగా మత వ్యవస్థలు, పాలకులు మత కులోన్మాదాలను ప్రోత్సహిస్తున్నారు. మత క్షేత్రాలను సందర్శించే యాత్రలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తి క్రమం నుండి ఆచార సాంప్రదాయాల్లోకి స్త్రీలను నెడుతున్నారు. నిజానికి ఇప్పుడు స్త్రీ మాతృత్వం మీద విపరీతమైన నిర్లక్ష్యం జరుగుతున్నది. ఎంతోమంది యువతులు ఉద్యోగాలు లేక, కట్న కానుకలు ఇవ్వలేక, పెళ్ళిళ్ళు గాక, ఒంటరి మహిళలుగా జీవిస్తున్నారు. ఇక భర్త చనిపోయిన, భర్తలు వలసలు పోయిన స్త్రీల మీద అరాచక శక్తులు దాడులు చేస్తున్నాయి. అసెంబ్లీలోనే వీటిపైన చర్చ జరుగుతుంది. ఒకపక్క గుట్కా, గంజాయి వంటి రకరకాల మత్తు పదార్థాలు, రకరకాల లిక్కర్లు ప్రతి వీధిలో దొరుకుతున్నాయి. ఇంటింటికి సరాఫరా చేసేవాళ్ళు కూడా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో స్త్రీ మాతృత్వాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం, విద్యా వ్యాపార, కార్మిక రంగాల్లో పనిచేస్తున్న స్త్రీలను శ్రమ దోపిడీ నుంచి రక్షించుకోవడం కోసం భారత రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన సందర్భం ఇది.

# అగ్నికీలలు మింగేస్తున్నా పాఠాలు నేర్వమా



హైదరాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు కేంద్రాలుగా ఎలా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. వ్యవస్థాపక లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే సంభవిస్తున్న దుస్థితికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరుగుతాయనుకుంటే పొరపాటే. తరచుగా ఇవి నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల పర్యవసానమే. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి.నిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేనివారితో చేయించిన తాత్కాలిక మరమ్మతులు%ొ%షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడం, మానవ నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి.ప్రణాళికాబద్ధం కాని వేగవంతమైన పట్టణీకరణ అధిక జనసాంద్రతకు దారితీసింది. వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనాన్ని వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాల తీవ్రతను పెంచుతుంది. అనేక నగర చారిత్రక కేంద్రాలు ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో నిండి ఉంటాయి. ఇవి ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. చిన్న మంటలు కూడా నియంత్రణకు అందని మహా విషాదాలుగా మారతాయి. అక్రమ నిర్మాణా లతో పాటు ఆక్రమణలు అత్యవసర మార్గాలను మూసి వేస్తాయి. ప్రాణాలను కాపాడే అవకాశాలను తగ్గిస్తాయి. సరైన నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వల్ల మంటలు చెలరేగిన ప్పుడు భవనం నుండి బయటపడటం కష్టమవుతుంది.సమస్యకు మరో కీలక కోణం ఏమిటంటే, మన దేశంలో అగ్ని భద్రతా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలున్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్, వివిధ రాష్ట్రాల అగ్నిమాపక సేవల చట్టాలు భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలైన ఫైర్–రెసిస్టెంట్ మెటీరియల్ వాడకం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ డిటెక్షన్, అణచివేత వ్యవస్థలు, తప్పనిసరి ఆడిట్‌లు, నిరభ్యంతర ధృవీకరణ పత్రం తప్పనిసరి చేస్తాయి. అయినప్పటికీ వీటి ఆచరణలో అనేక లోపాలున్నాయి. తగినంత మంది శిక్షణ పొందిన ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం, నియంత్రణ సంస్థలలో వనరుల కొరత, తనిఖీ అనుమతి ప్రక్రియలో జాప్యం, అవినీతి, భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, బాధ్యులను న్యాయస్థానాలకు అప్పగించే ప్రక్రియలో లోపం%ొ%నిర్లక్ష్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్ని భద్రత పట్ల విస్తృతమైన ప్రజా అవగాహన లేకపోవడం, సౌలభ్యం ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి కూడా ఈ సమస్య తీవ్రతరం చేస్తున్నాయి. భవనాలలో నివసించే వారికి, పని చేసే వారికి ప్రాథమిక అగ్ని భద్రతా పద్ధతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు.అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలో అవగాహన ఉండదు. ప్రైవేట్ భవనాలలో అగ్నిమాపక డ్రిల్స్ నిర్వహించడం చాలా అరుదు. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.ఈ బహుముఖ సమస్యను పరిష్కరించడానికి పటిష్టమైన, సమగ్ర వ్యూహం అవసరం. దీనికి ప్రభుత్వ నిబద్ధత, కఠినమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. కేవలం చట్టాలు ఉండటం కాదు. వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి.